

- దేవేందర్‌రెడ్డి అరెస్టుపై జిల్లాలో చర్చోపచర్చలు
- థాయ్ చట్టాల ప్రకారం కఠిన శిక్ష పడే చాన్స్..
- రేపు కోర్టులో ప్రవేశపెట్టనున్న పోలీసులు

థాయ్‌లాండ్ పోలీసులు పటాయాలలోని ఓ క్యాసినోపై జరిపిన దాడుల్లో మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలంలో టీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుడిగా దేవేందర్ రెడ్డి ఎదిగారు. అయితే ఇంతకుముందే చీకోటి ప్రవీణ్‌తో బిజినెస్ వ్యవహారాలు నడిపినట్టు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా కొంతకాలం క్రితం ఈడీ దాడుల నుంచి బయటపడ్డారు. కాగా, ఇప్పుడు గ్యాంబ్లింగ్, జూదం ఆడుతూ పటాయాలో క్యాసినోపై థాయ్ పోలీసులు జరిపిన దాడుల్లో దేవేందర్ రెడ్డి అరెస్టు అయినట్లు వస్తున్న వార్తలు జిల్లాలో సంచలనం రేపాయి.

- ప్రభ న్యూస్ బ్యూరో, ఉమ్మడి మెదక్

# గ్యాంబ్లర్!

- గ్యాంబ్లింగ్, జూదం ఆడుతూ అరెస్టు..

## థాయ్‌లో అడ్డంగా బుక్కయిన చిట్టి

(ప్రభన్యూస్ బ్యూరో, ఉమ్మడి మెదక్)

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం కేంద్రంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన చిట్టి దేవేందర్ రెడ్డి ఎక్స్ ప్లోజివ్ వ్యాపారంలో స్థిరపడ్డాడు. 2008లో దొవ్మాట నియోజకవర్గంలో జరిగిన మధ్యంతర ఎన్నికలతో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. నియోజకవర్గ పునర్విభజనలో కొండపాక మండలం గజ్వేల్ నియోజకవర్గంలో చేరడంతో అప్పటి డీసీసీబీ చైర్మన్ తూముకుంట నర్సారెడ్డి ప్రధాన అనుచరుడిగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో కొండపాక మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు.



### కాంగ్రెస్‌లో కీలక నేతగా..

2012లో జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎన్నికల్లో కొండపాక కేంద్రం నుండి చైర్మన్‌గా ఘనవిజయం సాధించారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన తూముకుంట నర్సారెడ్డికి మద్దతుగా నిలిచి, కొండపాక మండలంలో జెడ్పీటీసీగా తన సతీమణి చిట్టి మాధురిని గెలిపించుకున్నారు. కొండపాక మండల ఎంపీపీ స్థానాన్ని కూడా తన ప్రధాన అనుచరుడికి కట్టబెట్టి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు.

### డీసీసీబీ చైర్మన్‌గా..

2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం మంత్రి హరీశ్రావుతో అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరిన దేవేందర్ రెడ్డి అప్పటి డీసీసీబీ చైర్మన్ జైపాల్ రెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టి విజయం సాధించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సైతం టీఆర్ఎస్ పార్టీ నుండి క్రియాశీల పాత్ర పోషించి సీఎం కేసీఆర్ రెండోసారి ఘనవిజయం సాధించడంలో తన వంతు పాత్ర పోషించినట్టు తెలుస్తోంది.



### చికోటి ప్రవీణ్‌తో ఆర్థిక లావాదేవీలు..

2020లో జరిగిన డీసీసీబీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్గా చిట్టి దేవేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఇట్లా రాజకీయంగా అంచెలంచలుగా ఎదిగిన దేవేందర్ రెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ క్రియాశీల నాయకుడిగా మారారు. ఇదే తరుణంలో చీకోటి ప్రవీణ్ ఎదుర్కొన్న క్యాసినో అభియోగంలో చిట్టి దేవేందర్‌రెడ్డితో పాటు మరికొంత మందిపై ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఈడీ దాడుల నుండి బయటపడ్డ దేవేందర్ రెడ్డిని ప్రస్తుతం పటాయాలో థాయ్ పోలీసులు గేమింగ్ యాక్ట్ లో అరెస్ట్ చేసినట్టు తెలియడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పటాయిలో 90మంది జూదం ఆడుతున్నారన్న అభియోగంలో 83 మంది భారతీయులు అరెస్ట్ కావడం, అందులో మెదక్ జిల్లాకు చెందిన డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి ఉన్నట్లు వార్తలు రావడం ఇక్కడ సంచలనంగా మారింది.

### గ్యాంబ్లింగ్ ఆడుతూ పట్టుబడ్డ 90 మంది భారతీయులు..

థాయ్‌లాండ్‌లో ఇండియన్ గ్యాంబ్లింగ్ ముఠా పట్టుబడింది. పటాయలో 90మందిని అరెస్టు చేయగా అందులో 83 మంది భారతీయులున్నారు. కాగా, వీరిలో తెలంగాణకు చెందిన వారు కూడా ఉన్నట్టు సమాచారం అందుతోంది. అరెస్టు అయినవారిలో 14 మంది మహిళలున్నారు. వారి నుంచి భారీగా నగదు, గేమింగ్ చిప్స్‌ని టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చీకోటి ప్రవీణ్ ఆధ్వర్యంలో గ్యాంబ్లింగ్ జరుగుతున్నట్లు ఆరోణలున్నాయి.




### ఇవ్వాల కోర్టులో ప్రవేశపెట్టనున్న పోలీసులు

గ్యాంబ్లింగ్, జూదం ఆడుతూ పట్టుబడ్డ ఇండియన్ పౌరులు థాయ్ చట్టాల గురించి తమకు తెలియదని చెబుతున్నట్టు సమాచారం. అయితే.. సోమవారం మేడే సందర్భంగా కోర్టులకు సెలవు రావడంతో నిందితులను మంగళవారం థాయ్‌లాండ్ కోర్టులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఆ తర్వాత ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను, కేసు పూర్వాపరాలను పోలీసులు మీడియాకు వెల్లడించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

### పోలీసుల అదుపులో ఉన్నదెవరంటే..

గ్యాంబ్లింగ్ ఆడుతూ పట్టుబడ్డ వారిలో థాయ్ పోలీసుల అదుపులో ఉన్నదెవరనేది ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. అందులో చికోటి ప్రవీణ్, దాసరి మాధవ్‌రెడ్డి, మెదక్ జిల్లాకు చెందిన చిట్టి దేవేందర్‌రెడ్డి, దాసరి రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్, మోహన్‌కుమార్, కాసం వసంత, మదన్ మాలిక్, అప్పలరాజు హరి, జి. భరత్‌రెడ్డి ఉన్నట్టు తెలుస్తోంది.